తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
18 సెప్టెంబర్ 2026
పేజీలు : 08
Follow :



*ఒకవైపు ప్రజాపాలనా దినోత్సవం అంటూ రాష్ట్ర ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటుంటే.. మరోవైపు అదే ప్రభుత్వంలో బడుగుల పరిస్థితి దినదినగండంగా మారింది. ప్రజాపాలన కాస్త ప్రజా కంటక పాలనగా మారిందని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, ప్రజాపాలన దినోత్సవం రోజే సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్లో ఒక అపార్ట్మెంట్లోని ఒక ప్లాట్ కు కరెంటు కట్ చేశారు. దానికి కారణం బకాయిలు వేలల్లోనో, లక్షల్లోనో ఉన్నాయనుకుంటే పొరపాటే నెల బకాయి కేవలం రూ.351 మాత్రమే. అది కూడా కరెంటు బిల్లు చెల్లించేందుకు చివరితేదీ అయిన 17వ తేదీ గడువు పూర్తిగా ముగియకుండానే. మరి కోట్లల్లో, లక్షల్లో బకాయిలు ఉన్న బడా బాబులకు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇదే విద్యుత్ అధికారులు అతిథి మర్యాదలు చేస్తూ.. ఒక నిమిషం కరెంటు కోత కూడా లేకుండా జాగ్రత్తలు పడుతుండడం విశేషం.*

- గడువు చివరి రోజు పూర్తి కాకుండానే ఘాతుకం
- ఉన్నతాధికారుల నిర్లక్ష్య సమాధానం
- అధికారుల స్పందనపై బాధితుల ఆగ్రహం

# రూ. 351 బకాయికే..
# కరెంటు కట్

## ప్రజాపాలన దినోత్సవం రోజే విద్యుత్ అధికారుల దాష్టీకం

### బౌద్ధనగర్ డివిజన్‌లో గడువు ముగియకముందే విద్యుత్ సరఫరా నిలిపివేత

### నెలల పసిగుడ్డుతో తల్లడిల్లిన బాధితులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రజాపాలన దినోత్సవం రోజునే బౌద్ధనగర్ డివిజన్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో రూ.351 విద్యుత్ బకాయి కారణంగా ఓ ఫ్లాట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారని బాధితులు ఆరోపించారు. బిల్లు చెల్లింపు గడువు సెప్టెంబర్ 17తో ముగియాల్సి ఉండగా, అంతకు ముందే విద్యుత్ నిలిపివేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సమయంలో ముందుగా కరెంటు కట్ చేసి.. సదరు ఫ్లాట్కు వెళ్లిన విద్యుత్ సిబ్బందిని ఇంట్లోని గృహిణి, ఇరుగుపొరుగువారు విషయాన్ని వివరించారు. సదరు గృహిణి కేవలం పదిహేను రోజుల క్రితమే ఆ ఇంటిలోకి మారారని, ఆ బిల్లు గృహ యజమాని చెల్లిస్తారని చెప్పారు. ఇంట్లో నెలల పసిగుడ్డు, మరో చిన్నారితో తాను మాత్రమే ఉన్నానని, తన భర్త ఇంట్లో లేదని చెప్పినా వినిపించుకోకుండా రుసరుసలాడుతూ సదరు ఉద్యోగి అక్కడి నుంచి జారుకున్నాడు. దాదాపు నలభై డిగ్రీల వేడిలో ఫ్యాన్ కూడా లేకుండా కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేసినా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. ఇక చేసేదేమీలేక సదరు బాధితురాలు చిన్నారులతో సహా పొరుగింట్లో తలదాచుకున్నారు.

**ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే..**

దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులైన ఏఈ, ఏడీలకు ఫిర్యాదు చేసినా వారి సమాధానం విని అవాక్కవడం బాధితుల వంతైంది. బకాయి పడింది కాబట్టే కరెంట్ కట్ చేశారని వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని వాపోయారు. దీనిపై నమస్తే తెలంగాణ ప్రతినిధి ఈ ప్రాంతానికి నేరుగా బాధ్యుడైన ఏఈ సత్యనారాయణకు పదుల సంఖ్యలో ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. ఒకసారి మాత్రం ఫోన్ ఎత్తి.. విషయం కనుక్కుని చెబుతానని చెప్పి, తిరిగి ఎన్నిసార్లు చేసినా ఫోన్ ఎత్తలేదు. విలేకరులు లోపలి పేజిలో

## బడుగులపై ఉక్కుపాదం.. బడా బాబులకు రెడ్ కార్పెట్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒకవైపు బడుగులపై ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు బడా బాబులకు రెడ్ కార్పెట్ వేస్తుందని ప్రజలు మండిపడుతున్నారు. హైడ్రా పేరుతో నేరుగా పేదల ఇళ్లపైకి బుల్డోజర్ తో విరుచుకుపడుతున్న ప్రభుత్వం.. దానిని దూరదృష్టితో నగరంలో సంస్కరణలు, చెరువుల పరిరక్షణ వంటి కారణాలు చెబుతోందని దుయ్యబడుతున్నారు. తాజాగా విద్యుత్ ఉద్యోగుల దాష్టీకానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

## హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- అంబేద్కర్‌పై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- బహుజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- సూరారం ఎక్స్‌రోడ్డులో దళిత సంఘాల ర్యాలీ
- సీఐకి వినతిపత్రం అందజేత



లోపలి పేజిలో

## ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధే ప్రజాపాలన లక్ష్యం

- ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలి
- శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం
- మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి
- ప్రజలు-పోలీసుల మధ్య నమ్మకం బలోపేతం కావాలి: సీపీ రమేష్




## మాదకద్రవ్యాలకు.. యువత దూరంగా ఉండాలి

- నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కరణం మురళి
- ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ అవగాహన సదస్సు

లోపలి పేజిలో




## ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌కు క్లీన్‌టెక్ స్వీకరణపై సీఐఐ సదస్సు

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** నగరంలో సీఐఐ నిర్వహించిన 25వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ -2026లో భాగంగా హెచ్ఐసీసీలో ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రీనింగ్ మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌ను పరిశ్ర మల శాఖ అదనపు డైరెక్టర్ డి.శ్రీనివాస్ నాయక్ తోకలసి జాయింట్ డైరెక్టర్ మధుకర్ బాబు, సమ్మి ట్ చైర్మన్ తేజ్‌ప్రీత్ సింగ్ చోప్రా,రిచ్ డైరెక్టర్ శ్రీనివా స్ చెర్లా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.సాంకేతికత, భాగస్వామ్యాలతో ఎంఎస్ ఎంఈల శక్తి సామర్థ్యం, ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచాల్సిన అవసరాన్ని ముఖ్య అతిథులు వివరించారని తెలిపారు. రాంప్ కింద రిచ్, సీఐఐ




సాంకేతిక భాగస్వామ్యంతో తెలంగాణలో సుమారు 2వేల ఎంఎస్ఎంఈలకు ఆర్ఈసీపీ అంచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

### జాతీయ పతాకావిష్కరణ



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 17 ( జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,గ్రామ కార్యాలయాలలో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.తెలంగాణ ప్రజలకు 1948 సెప్టెంబర్ 17న రాచరిక వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ వచ్చిన రోజుగా గుర్తుండిపోయిందని పలువురు ప్రజా పతినిధులు అన్నారు.ఎందరో పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ స్వతంత్రం లభించిందని గుర్తు చేశారు. ఏర్పుమళ్ళలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకటయ్య,శ్రీనివాస్,నర్సింలు,ఈశ్వరయ్య,లక్ష్మి, దేవమ్మ,ఆశమ్మ,అంగన్వాడీ టీచర్ గౌసీయ బేగం,ఆశ వర్కర్ నర్సమ్మ, అంజయ్య,సత్యయ్య, ప్రవీణ్, చిన్న నర్సింలు,అంజయ్యతదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు వేడుకలు



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 17(జనం సాక్షి):** మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలోని 194,195 బూత్ లలో గురువారం ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు వేడుకలు, తెలంగాణ విమోచన దినోత్సవం, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలను బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉప్పరీ జగదీశ్వర్ సాగర్,నాగురావు, బాబయ్య నాయుడు, రాజారాంరెడ్డి, సిహెచ్. నర్సింలు, శ్రీనివాస్, గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో.. ప్రజాపాలన దినోత్సవం

### జాతీయ జెండాను ఆవిష్కరణ చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను చాటుతూ జిల్లా యంత్రాంగం చేపట్టిన పకడ్బందీ ఏర్పాట్లు, కార్యక్రమ సరళి అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల చిత్రపటాలకు నివాళు లర్పించారు. తెలంగాణ సాధనలో ప్రాణాలర్పించిన అమరవీరులు శేఖర్ రెడ్డి, సిరిపురం యాదగిరి, కాకి కుమార్, దినేష్ చంద్ర కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన అభివృద్ధినీ వివరించారు. ఈ వేడుకల్లో టి యు ఎఫ్ ఐ డి సి ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్ తో పాటు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఉన్నారు.

# కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలు



**హయత్‌నగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి హయత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్ అధ్యక్షురాలిగా రజిని రావు, జీఎస్ఐ డివిజన్ అధ్యక్షుడిగా కృపాకర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా చెన్నగోని రవీందర్ గౌడ్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా బాబా యాదవ్, సాహెబ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా రమేష్ నాయక్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా పర్వతి గణేష్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా కొల్లూరి శ్రీనాథ్, చింతలకుంట డివిజన్ అధ్యక్షురాలిగా కంచర్ల కవిత, బైరమల్‌గూడ డివిజన్ అధ్యక్షుడిగా గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షురాలిగా జె. సంగీత శశిధర్ రెడ్డి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడిగా నోముల రవీందర్ గౌడ్, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడిగా కందికంటి శ్రీధర్ గౌడ్, కర్మన్‌ఘాట్ డివిజన్ అధ్యక్షుడిగా రమాకాంత్ గుప్తా, గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షుడిగా ఎం. సునీల్ బాబు, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడిగా గంధం రవి కేశవలకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో డివిజన్ అధ్యక్షుల పాత్ర కీలకమని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీని మరింత పటిష్టం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

# త్యాగాల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలి

### ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి)**తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వ సలహాదారుకే.కేశవరావు పిలుపునిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగాకే.కేశవరావు మాట్లాడుతూ.. తెలంగాణ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని అన్నారు. వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడంతోపాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కేశవరావు పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, అంగన్‌వాడీల నిర్వహణ, రేషన్ కార్డుల పంపిణీ, అభయహస్తం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా మహిళా శక్తి, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా, మహిళలు, చిన్నారుల భద్రత కోసం టీ--సేఫ్ యాప్ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి సంక్షేమం, సమతుల్య అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని కే. కేశవరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్‌కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్‌రెడ్డి, డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగదాంబ దేవాలయాన్ని ఎండోమెంట్‌లో చేర్చడంపై గ్రామస్తుల అభ్యంతరం

### కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం అందజేసిన రాఘవాపురం గ్రామస్తులు



**మేళ్లచెర్వు జనం సాక్షి న్యూస్::** మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఉన్న జగదాంబ తల్లి దేవాలయాన్ని గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సమగ్ర విచారణ నిర్వహించకుండానే ఎండోమెంట్ పరిధిలోకి చేర్చారని ఆరోపిస్తూ గ్రామ పెద్దలు, రైతులు గురువారం కలెక్టర్, ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సంద ర్భంగా గ్రామస్తులు మాట్లాడు తూ.. ఒక కుటుంబానికి చెందిన సాతులూరి చిన శంబయ్య మరియు అతని వారసులు స్వయంగా నిర్మించుకుని, తమ కుటుంబ ఆచారాల ప్రకారం పూజలు నిర్వహించుకుంటున్న దేవాలయాన్ని కొంతమంది కావాలనే అధికారులతో కుమ్మక్కై ఎండోమెంట్ పరిధిలోకి చేర్చారని ఆరోపించారు. దేవాలయంలోగానీ, గ్రామంలోగానీ ఎలాంటి నోటీసులు ఏర్పాటు చేయలేదని తెలిపారు.అలాగే జగ్గుతండా గ్రామ పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సైతం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఈ ప్రక్రియ చేపట్టారని వారు పేర్కొన్నారు. దేవాలయానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అలాగే కొంతమంది సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్ లల్లో తప్పుడు ప్రచారాలు చేసి దేవాలయ ప్రతిష్ట దెబ్బతినెలా మాట్లాడుతూ రెచ్చ గోడుతున్నారని వీరిపై కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మరియు ఎస్పీని కోరారు.ఈ కార్యక్రమంలో సాతులూరి వెంకటయ్య,సాతులూరి బాబు, సాతులూరి వెంకట్రావు,సాతులూరి మాధవరావు, కోడె సుబ్బారావు, భారి కృష్ణయ్య, చలకపల్లి రామారావు, దేవానబోయిన సత్యం, సూరయ్య, నర్సయ్య, శేషగిరి,పాటు రాఘవాపురం గ్రామానికి చెందిన దాదాపు 50 మంది గ్రామస్తులు పాల్గొని తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

# ముషీరాబాద్‌లో ఘనంగా హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు

### పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పండ్ల పంపిణీ



**ముషీరాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి):**హైదరాబాద్‌లోని ముషీరాబాద్ శివాలయం వద్ద హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జాతీయ జెండాను ఎగురవేసి, దేశ ప్రజలకు హైదరాబాద్ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు జమాల్‌పురి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.అలాగే గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ముషీరాబాద్ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పండ్లను పంపిణీ చేశారు. నగర పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. వారి సేవలు ప్రజారోగ్యం, పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్, బద్రీనాథ్, ఆయుష్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆదివాసీల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చిరస్మరణీయం

### కాంగ్రెస్ పాలనలో 420 హామీలు - మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి::-** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో గిరిజనుల సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. గిరిజనులకు ఉన్న రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా..మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి నాయకత్వంలో గిరిజన నాయకులు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చడం, పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం, గిరిజన రైతుల సాగుభూముల అభివృద్ధికి గిరి వికాసం వంటి కార్యక్రమాలను గత ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు."హామీలు ఎక్కడ? అమలు ఎక్కడ?"గిరిజన డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, గిరిజనుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు, అమలు వివరాలను ప్రజల ముందు ఉంచాలని జక్కా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు."కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చింది.. ఇప్పుడు ఆ హామీల అమలు ఎక్కడో గిరిజనులకు చెప్పాలి" అని ఆయన ప్రశ్నించారు.ఎస్టీ రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలు కేవలం రాజకీయ ప్రకటనలు కాదని, గిరిజన యువత విద్య, ఉద్యోగ అవకాశాలతో నేరుగా ముడిపడి ఉన్న అంశాలని జక్కా వెంకట్ రెడ్డి అన్నారు.ప్రస్తుత అధికారిక విద్యా ప్రవేశాల పత్రాల్లో కూడా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌ను33, 30-09-2022 ఆధారంగా చూపిస్తున్నారని తెలిపారు.గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, భూమి హక్కులు, సంక్షేమ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, కొడె పోచయ్య, యూత్ అధ్యక్షులు ప్రభు, సీనియర్ నాయకులు శ్యామల సాయిలు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, సాయి శెట్టి, మల్లం వెంకటేష్ గౌడ్, బుల్లెట్ శంకర్, గడీల జగన్ రెడ్డి, కిరణ్ నాయక్, వెంకట్ నాయక్, జిలాని పాషా,చిత్ర సంతోష్ రెడ్డి, శంకర్ చారి, పాశం నరేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, నారాయణ రెడ్డి, పుల్ల శ్రీనివాస్, లాజర్, వారికల శ్రీనివాస్, కైసర్, అక్షిత్, రామకృష్ణ, తిరుమలేష్, చిరంజీవి, ఇందిరా, సరస్వతి, కళ్యాణి, లావణ్య, రాజేశ్వరి, లక్ష్మీసరిత, రాజ్ కుమార్, శ్రీను నాయక్, రామ్ నాయక్, యాకు నాయక్, జాటోత్ అశోక్, నాగేశ్వరరావు, వేణుగోపాల్, చంద్రశేఖర్, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలపై రోడ్డెక్కిన మోత్కూర్ రైతులు

### ఉన్నత అధికారులు స్పందించడం లేదని ఆగ్రహించిన రైతులు, మాజీ ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు.

**దోమ సెప్టెంబర్ 17 జనం సాక్షి...:**దోమ మండలం, మోత్కూర్ విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ మోత్కూర్ గ్రామ రైతులు రోడ్డెక్కారు. మోత్కూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'వద్దురా నాయనా.. ఈ కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ.. కష్టపడి పంటలు సాగు చేస్తున్న సమయంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో బోరుబావులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అయితే బోర్ల ద్వారా పంటలకు నీరు అందించేందుకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న విద్యుత్ సరఫరాకు, క్షేత్రస్థాయిలో అందుతున్న విద్యుత్‌కు పొంతన లేదని ఆరోపించారు.'రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదు', 'రైతు ఏడిస్తే రాజ్యమే ఏడుస్తుంది' అంటూ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖ ఏఈ, డీఈలు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరగా, రైతులు తమకు తక్షణమే స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారులతో రైతులు వాదోపవాదాలకు దిగారు. సమస్య పరిష్కారమయ్యే వరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకుని బైఠాయించారు.రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు.



పోలీసులు పలుమార్లు రైతులతో మాట్లాడి రహదారి నుంచి పక్కకు వెళ్లాలని కోరినప్పటికీ, విద్యుత్ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన కొనసాగించారు. దీంతో కొంతసేపు రహదారిపై నిరసన కొనసాగింది.ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మోత్కూర్ గ్రామ రైతులకు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని రైతులు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పేర్కొంటూ తక్షణమే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమం లో మోత్కూర్ రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

# పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### :అఫ్జల్ ఖాన్



**శామీర్ పేట్, సెప్టెంబర్ 17(జనం సాక్షి )**పండుగలు ఏవైనా సామరస్యంగా కలిసి మెలిసి చేసుకోవాలని సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ అన్నారు. శామీర్ పేట్ లో బుధవారం రాత్రి అంబేద్కర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద జరిగిన అన్న దాన కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ కు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. అఫ్జల్ ఖాన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.పండుగలు ఏవైనా అందరు కలిసి మెలిసి సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని తెలిపారు. ఇందులో అఫ్జల్ ఖాన్ తో పాటు బుర్క వెంకటేష్,ఆకుల జితేందర్,బుర్క ప్రవీణ్,బుర్క రాజు,బుర్క లక్ష్మణ్,బుర్క పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో జోనల్ కమిషనర్ పర్యటన

### అభివృద్ధి పనులు, నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన



**రాజేంద్రనగర్, సెప్టెంబర్17(జనంసాక్షి)**రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి గురువారం పర్యటించారు. రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.అనంతరం హైదర్‌గూడ బాపుఘాట్ నుంచి నందనవనం అపార్ట్‌మెంట్ వరకు మూసీ నది పక్కన నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. హనుమాన్‌నగర్ పత్తికుంట వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నరేందర్ గౌడ్, ఈఈ వెంకట శేషయ్య, రాజేంద్రనగర్, అత్తాపూర్ డీసీలు బి.సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన యాలాల నూతన ఎంఈఓ

### పాఠశాలల సమస్యలను వివరించిన ఎంఈఓ శాంతప్ప



**యాలాల సెప్టెంబర్ 17 ( జనం సాక్షి ) :** యాలాల మండలం నూతన మండల విద్యాధికారి వై. శాంతప్ప గౌరవ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు.అనంతరం జపాన్ టీచర్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు వెళ్లి వచ్చిన సి.కృష్ణారెడ్డి, ఎస్ఏ (ఇంగ్లిష్) జపాన్ విద్యా వ్యవస్థ, పాఠశాలల నిర్వహణ, అక్కడ అమలవుతున్న బోధనా విధానాలపై ఎమ్మెల్యేకు వివరించారు. జపాన్ విద్యా విధానంపై కృష్ణారెడ్డి అందించిన వివరాలను ఎమ్మెల్యే ఆసక్తిగా తెలుసుకున్నారు.జపాన్ టీచర్ ఎక్స్‌పోజర్ విజిట్‌ను విజయవంతంగా పూర్తి చేసి వచ్చిన కృష్ణారెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో వినూత్న బోధనా పద్ధతులను తెలుసుకోవడం, వాటిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# మోదీ జన్మదిన వేడుకలు

## నేర్రపల్లిలో పండ్లు, స్వీట్ల పంపిణీ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):**భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను నేర్రపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొర్దెంల్ల హేమలత శ్రీహరి ఆధ్వర్యంలో స్థానిక ప్రీ-ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హేమలత శ్రీహరి మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో దేశానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలగ వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆల్వాల్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు పద్మ, అరుణ్ యాదవ్, అఖిల, పాఠశాల హెడ్ మాస్టర్ వేణు మాధవ్, పంచాయతీ సెక్రటరీ రాజ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, అలాగే ప్రశాంత్, భార్గవ్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

### తెలంగాణ సాయుధ పోరాట అమరులకు నివాళులు అర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న రాచరిక పాలన ముగిసి తెలంగాణలో ప్రజాస్వామిక పాలనకు శ్రీకారం చుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాలను వివరించారు.తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులు అర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, కమిటీ సభ్యులు మచ్చేందర్ రెడ్డి, నరసింహ, అంజయ్య, జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తదితరులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవ్ నగర్‌లో ఘనంగా గణేష్ పూజలు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)**మాధవ్ నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ దంపతులు పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బీజేపీ



**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అత్తెల్లి అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి 1947లో స్వాతంత్య్రం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా లక్షలాది మంది ప్రజలు పోరాటం చేశారని తెలిపారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన చర్యల అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై, ప్రజలకు నిజాం పాలన నుంచి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వివిధ పేర్లతో నిర్వహించడం ద్వారా చరిత్రను ప్రజలకు భిన్నంగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనంత్ రెడ్డి విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం విమోచన పోరాట చరిత్రను, అందులో ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను మరుగునపరచడం సరికాదన్నారు. నిజాం పాలనలో పీడనకు, హింసకు గురైన ప్రజల పోరాటాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ చరిత్రను ప్రజలకు వాస్తవాలతో తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని ఆయన విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పాలన కోసం బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డా.వైభవ్ రెడ్డి, కౌన్సిలర్లు కరికె మీనాక్షి సత్యనారాయణ, అత్తెల్లి మనిషాఅనంత్ రెడ్డి, పెద్దోళ్ల దయాకర్, జనరల్ సెక్రటరీ పత్తి సత్యనారాయణ, చేగూరి ప్రవీణ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జి. శ్రీనివాస్ రెడ్డి, జి.పురుషోత్తం రెడ్డి, చిరు శ్రీనివాస్, ఏ.రాజు, రమేష్, బీరప్ప, కర్ణాకర్, వడ్డే గణేష్, అశోక్, బి. చంద్రశేఖర్ రెడ్డి, కే.చంద్రశేఖర్ రెడ్డి, హర్షిత్, రాకేష్, జి.మధుసూదన్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, శ్రీకాంత్, పి.వెంకటేష్, సిహెచ్. నరసింహులు, చాకలి శ్రీనివాస్, తెలుగు శ్రీనివాస్, కె.మహేందర్, నగేష్, నాగరాజు, కృష్ణ రెడ్డి, గోవర్ధన్, శ్రీతం రెడ్డి, మల్లేష్, అంజనేయులు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం



**హయత్‌నగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని గర్భిణీ స్త్రీలకు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. ప్రజా సేవే లక్ష్యంగా పేదలు, అవసరమైన వారికి సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, గర్భిణీ స్త్రీలు, రోగులు మరియు ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆయురారోగ్యాలతో దేశ ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బందారి భాస్కర్, హయత్‌నగర్, హైకోర్ట్ కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహా, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోరంద మహేష్, నాయకులు జంగా రెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్, అభిలాష్, హ్రితిక్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా రూ. 35 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన



**మాడుగులపల్లి సెప్టెంబర్ 17 (జనం సాక్షి):**అభివృద్ధికి మరో పేరు రహదారులని, తమ ప్రభుత్వం రోడ్ల విస్తరణ, నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో మాడుగులపల్లి నుండి తిప్పలమ్మగూడెం ఎక్స్ రోడ్డు వరకు రూ. 35 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ, పటిష్టపరిచే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ. 40,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఇందులో రూ. 26,000 కోట్లతో హ్యాం, నాన్-హ్యాం రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలలో రూ. 110 కోట్లతో మొదటి దశ రోడ్డు పనుల టెండర్లు పూర్తయ్యాయని, ఈ నెల 20న పూసలపాడు రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులుఎల్ నినో ప్రభావంతో విద్యుత్ సమస్య తలెత్తకుండా తిప్పర్తి, మాడుగులపల్లి మండలాల కోసం రూ. 200 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. 2028 జూన్ నాటికి ఎస్ఎల్బీసీ (హాడీజ) ద్వారా సాగునీరు అందించి జిల్లాలో ఫ్లోరైడ్, కరువు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని, చెరువుపల్లికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందిస్తామన్నారు.సంక్షేమ పథకాలు ఓ మౌలిక వసతులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా ప్రతి లబ్ధిదారునికి రూ. 5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. చెరువుపల్లి గ్రామానికి ఈ సంవత్సరం 25, వచ్చే సంవత్సరం 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పేదలందరికీ సన్న బియ్యం, స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు.అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నల్గొండ జిల్లా కేంద్రంలో ఔటర్ రింగ్ రోడ్డును డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌తో ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తిప్పర్తిలో జూనియర్ కళాశాల, 30 పడకల ఆస్పత్రి, కనగల్‌లో ఆస్పత్రితో పాటు రూ. 14.70 కోట్లతో సమీకృత మండల కాంప్లెక్స్, జూనియర్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు గౌస్ మియా , తాసిల్దార్ సరోజ పావని, ఎంపీడీవో వంశీధర్, స్థానిక సర్పంచులు, నాయకులు వడ్డే సైదిరెడ్డి, బెల్లి జానయ్య, అరూరి నరేష్, గడ్డం పద్మా ప్రభాకర్ రెడ్డి,బొమ్మ కంటి కల్పనా కిరణ్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రెడ్డి, భవిత,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రామ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ తిప్పర్తి సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రమద స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు సెప్టెంబర్ 17(జనంసాక్షి)** తాండూరు పట్టణంలో నేడు జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ నిమజ్జన మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు, క్రేన్లు మరియు పోలీసు బందోబస్తు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉత్సవాలు ఎంత ఘనంగా నిర్వహిస్తున్నామో.. నిమజ్జన కార్యక్రమాల్లో అంతే జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గణేష్ మండపాల నిర్వాహకులకు విజ్ఞప్తి



చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడళ్లు పాత తాండూరు, అంబేద్కర్ పార్క్, భద్రప్పగుడి, శివాజీ చౌక్ మరియు నిమజ్జన ఘాట్ లు మల్ రెడ్డి పల్లి, కోకట్ వాగులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలే పాలనకు కేంద్రబిందువు.. ప్రజా సంక్షేమమే లక్ష్యం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి)** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చేవెళ్ల పురపాలక సంఘం కార్యాలయం, చేవెళ్ల సహకార సంఘం కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేయగా, సహకార సంఘం కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కాలే యాదయ్య జెండాను ఆవిష్కరించారు. చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే ప్రజా పాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని అన్నారు. ప్రజలే పాలనకు కేంద్రబిందువు.. ప్రజా సంక్షేమమే లక్ష్యం.. తెలంగాణ అభివృద్ధే మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే



కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగి రెడ్డి, కళ్యాణి యాదగిరి, సుచిత బల్వంత్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, క్రిష్టా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్, కో-ఆప్షన్ సభ్యులు రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సహకార సంఘం డైరెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో తండాలకు ప్రత్యేక గుర్తింపు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

### కందనెల్లి తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**పెద్దేముల్, సెప్టెంబర్ 17(జనంసాక్షి)** గిరిజనుల సంక్షేమం,తండాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందాయని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి గుర్తుచేశారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి తండాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఐఐటి నీట్ కోచింగ్, స్కాలర్‌షిప్‌లు వంటి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఎస్టీలకు ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ చట్టబద్ధత కల్పించి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. అలాగే ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెద్దేముల్ మండలంలో ప్రతి తండాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేశామని తెలిపారు. రోడ్లు, ముఖ్యంగా తండాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ దీపాలు,



గ్రామపంచాయతీ బిల్డింగులు అంగన్వాడి బిల్డింగ్ లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలక్షన్లలో ఇచ్చిన మాట ప్రకారం గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, హామీలను అమలు చేయాలని తెలిపారు. గిరిజన తాండాలలో వారి అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు. కందనెల్లి తండా గ్రామ కమిటీ అధ్యక్షుడు జై సింగ్, మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రుక్మాపూర్ తోపోజి రమేష్, రవీందర్, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, చంద్రప్ప పాండు జ్ఞానేశ్వర్, వెంకటేచారి, స్వరాజ్ బలరాం, దన్ సింగ్, సంతోష్, మల్లప్ప, నగేష్, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

### మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బ్యూలా

**బంట్వారం సెప్టెంబర్ 17జనం సాక్షి** :తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బంట్వారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూలా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్యూలా మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ పటాలు పరిశీలించండి విద్యార్థులను అభినందించండి అన్న ప్రిన్సిపల్.



# యాచారంలో ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

### : రామాలయంలో ప్రత్యేక పూజలు



**యాచారం సెప్టెంబర్ 17 (జనం సాక్షి ):** 140 కోట్ల మంది భారతీయుల గుండె చప్పుడు, ప్రపంచ దేశాలకు సింహ స్వప్నంగా నిలిచిన నాయకుడు, గత 25 సంవత్సరాలుగా దేశం కోసం నిర్విరామంగా పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా యాచారం మండల కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. దేశ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా 24 గంటలూ శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి ఆ శ్రీరామచంద్రమూర్తి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ సందర్భంగా భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి తాండ్ర రవీందర్, సీనియర్ నాయకులు గొల్లపల్లి జంగయ్య గౌడ్, నడుకుడి కృష్ణ, నాయిని పాండురంగ రెడ్డి, విష్ణుమూర్తి పంతులు, ఏడల్లి సత్తయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు పల్లపు నరేష్, ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, కార్యదర్శులు బొడ్డు భాషయ్య, సాటు మల్లేష్, బీజేవైఎం నాయకులు జెల్లా శ్రీనాథ్ గౌడ్, మేకం ఐలేష్, బన్నే శివ, మస్కు కుమార్, జాపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

### ఎల్బీనగర్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు పురస్కరించుకుని భరోసా హాస్పిటల్ నిర్వాహకులు ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశాభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో మోదీ చేసిన కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమానికి బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయ్ కిరణ్ ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ మోదీ మరింతకాలం దేశానికి సేవలందించాలని, మరో రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ హస్తినాపురం అధ్యక్షుడు ఎరుకుల మల్లేష్ గౌడ్, ఆసుపత్రి సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పోల్కంపల్లి గ్రామానికి..బీఆర్ఆర్ ఫౌండేషన్ కుర్చీల పంపిణి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)** "ప్రజా సేవే లక్ష్యం... బీఆర్ఆర్ ఫౌండేషన్ సేవా ప్రస్థానం" అనే నినాదంతో ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి బీఆర్ఆర్ ఫౌండేషన్



చైర్మన్ బూడిద రామ్ రెడ్డి పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి, డ్వాక్రా సంఘాల మహిళల ఉపయోగం కోసం మొత్తం 60 కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జి. బాలమణి, సిహెచ్. స్వాతి శ్రీనివాస్, సిహెచ్. నర్సింహా, కె. సుధారాణి, జి. మల్లేష్, ఎం. మమత, బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు సిహెచ్. రవీందర్, కె. కృష్ణ భాస్కర్, డి. నర్సింహా, దర్శన్ గౌడ్, జి. బాలశివుడు, ఎం. పురుషోత్తం, మహేందర్, బాబాయ్ గౌడ్, మల్లేష్ గౌడ్, బాలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు..యువత దూరంగా ఉండాలి

రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కరణం మురళి సూచించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ సెల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం సామాజిక శాస్త్రాల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో "దార్శనికత నుండి కార్యాచరణ వైపు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ – బాబు జగ్జీవన్ రామ్ ఆలోచనా విధానం – సామాజిక మార్పు" అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం స్వార్థపూరిత జీవితం గడపకుండా సమాజ పురోగతికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి ఇంత గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుందన్నారు. విద్య, నైపుణ్యాల ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగిపోయి సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తీసుకువచ్చిన చట్టాలను వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తీసుకువచ్చిన చట్టాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ... విద్యార్థులు మహనీయుల ఆచరణాత్మక విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని



సమాజంలోని సామాజిక, ఆర్థిక రుగ్మతలను నిర్మూలించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యుత్తమైన రాజ్యాంగాన్ని అందించి దేశ సమైక్యతకు బాటలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్య కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్ ,,ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ ప్రొఫెసర్ డైసీ, ఓయూ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ లింగప్ప, ఓయూ బీసీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మాధవి, సమన్వయకర్తలుగా డాక్టర్ ఎస్. రమేష్, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి జి. రవికుమార్, ఆంగ్ల విభాగాధిపతి డి.ఎస్.ఎస్.ఆర్ కృష్ణ, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ రాకేష్ భవాని, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. సురేష్, అధ్యాపకులు డి.వి. రావు, టి. శ్రీకృష్ణ, డాక్టర్ రచన, హృదయ రాజ్, డాక్టర్ మాధవి, సురేఖ పాల్గొన్నారు.

## గురు నానక్ విద్యాసంస్థలో ముగిసిన ఆరు రోజుల ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 17(జనం సాక్షి ): సమీపంలోని గురు నానక్ సాంకేతిక కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల అధ్యాపక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. "వాస్తవ ప్రపంచ వినియోగంలో లోతైన యంత్ర అభ్యాస ప్రక్రియ ప్రాథమిక సూత్రాల నుండి అమలు వరకు" అనే కీలక అంశంపై అధ్యాపకులకు ఈ శిక్షణ ఇచ్చారు.




ఈ కార్యక్రమానికి సంస్థల ఉపాధ్యక్షులు, విశ్వవిద్యాలయ కులాధిపతి సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, నిర్వహణ సంచాలకులు, విశ్వవిద్యాలయ ఉపకులాధిపతి డాక్టర్ హెచ్. ఎస్. సైనీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముంబై అణు విద్యుత్ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ లలిత్ కుమార్ సింగ్, హైదరాబాద్ విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యులు డాక్టర్ సి. గణేష్ కుమార్, సాంకేతిక ఆవిష్కరణల కేంద్రం ఉపాధ్యక్షులు శ్రీ శ్రీనివాస్ తాలూకా తదితర ప్రముఖ నిపుణులు పాల్గొని కృత్రిమ మేధస్సు, లోతైన అభ్యాస నమూనాలు మరియు ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అధ్యాపకులు సాంకేతిక ఆవిష్కరణల కేంద్రాన్ని సందర్శించి ప్రత్యక్ష అవగాహన పెంపొందించుకున్నారు. ఈ శిక్షణ ద్వారా అధ్యాపకులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు మరియు పరిశ్రమల అవసరాలపై పూర్తిస్థాయి అవగాహన లభించిందని కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎస్. శ్రీనాథ రెడ్డి, డాక్టర్ రిషి సయాల్, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ ఎస్. వి. రంగనాయకులు, డాక్టర్ గీతా త్రిపాఠి, డాక్టర్ మధు, డాక్టర్ రవీంద్ర తదితర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## చింతపట్ల గ్రామానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 కుర్చీల పంపిణీ

యాచారం, సెప్టెంబర్ 17( జనం సాక్షి ) మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, డ్వాక్రా సంఘాలు మరియు అంగన్వాడీ కేంద్రాలకు కలిపి మొత్తం 40 కుర్చీలను ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బూడిద రామ్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధిలో తమ వంతు సహకారం అందించడమే ఫౌండేష న్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘాలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలకు అవసరమైన చిన్న చిన్న వసతులను కల్పించడం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా చింతపట్ల గ్రామంతో పాటు యాచారం మండలంలోని అన్ని గ్రామాలకు తమ ఫౌండేషన్ తరఫున



సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొట్ల రమేష్,వార్డు సభ్యులు దేవేందర్ గౌడ్, అంజని శ్రీను, భాగ్య జగన్, చంద్రకళ, బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు గొరిగె శివకుమార్, దేవరకొండ మల్లేష్, జానీ, దేవరాజ్, మనోజ్, శివ సాయి, గిరి, భరత్, వంశీ, డ్వాక్రా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రూ.351 బకాయికే కరెంటు కట్

ఫోన్ చేస్తేనే ఈ పరిస్థితి ఉంటే సాధారణ ప్రజానీకానికి వీరి నుంచి వచ్చే సమాధానమేంటో మనం సులువుగా అర్థం చేసుకోవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆవు చేనులో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా... అన్నట్లు ఉన్నతాధికారుల వైఖరి ఇలా ఉంటే.. కింది స్థాయి సిబ్బంది ఇంకా ఎలా ఉంటారో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానిస్తున్నారు.

**ఎమ్మెల్యే కార్యాలయ రంగప్రవేశంతో మారిన పరిస్థితి**

చివరికి విషయం ఎమ్మెల్యే కార్యాలయానికి చేరడంతో అక్కడి సిబ్బంది ఏఈ సత్యనారాయణకు ఫోన్ చేయగా అప్పుడు స్పందించిన సదరు ఏఈ విషయం తెలుసుకుని, కేవలం మెయిన్ ఆఫ్ చేశారని, తమ సిబ్బంది వెళ్లేసరికి మెయిన్ ఆన్ చేసే ఉందని సమాధానం ఇచ్చారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బాధితులకు తెలపగా, తమకు విషయం తెలియదని చెప్పారు. వేగంగా స్పందించిన ఎమ్మెల్యే సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పి, బతుకుజీవుడా అనుకుంటూ ఇంట్లోకి ప్రవేశించారు.

## హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలి

నిజాంపేట్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని అంబేద్కర్ వారసులు, బహుజన సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ మేరకు గురువారం సూరారం అంబేద్కర్ భవన్ నుంచి సూరారం ఎక్స్‌రోడ్డు వరకు దళిత సంఘాల ఐక్యవేదిక, విశ్వరత్న బహుజన వెల్ఫేర్ సొసైటీ, ఎమ్మార్పీఎస్, ఆర్‌పీఐ, జైభీమ్ మహాసేన, మాల మహానాడు తదితర సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లకు పునాది వేసిన అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సూరారం సీఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ జేమ్స్ రామ్‌చందర్, గట్టు అశోక్, కిషన్‌రావు, చింతూరు అశోక్, అంజనేయులు, గజానంద్, నర్సింగ్ యాదవ్, రతన్, లక్ష్మణ్, అనిల్, డేవిడ్, మున్నా, శిల్పకార్ దిలీప్, చంద్రకాంత్, బుచ్చయ్య, ఎన్.ఎస్.రాజు, రవి, చైతన్య, గజ్జల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీగా పాశం బుచ్చి యాదవ్



బోడుప్పల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీలో పాశం బుచ్చి యాదవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా ఆయనను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన పాశం బుచ్చి యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వజ్రేష్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, సీనియర్ నాయకులు దర్గా దయాకర్‌రెడ్డి, పాశం రాజు యాదవ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలనీ ప్రజల సంక్షేమమే ధ్యేయం : అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి

రాజేంద్రనగర్,సెప్టెంబర్17(జనంసాక్షి) నెక్నాంపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర కాలనీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, భద్రతే లక్ష్యంగా వెంకటేశ్వర కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరంతరం పనిచేస్తోందని అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి



తెలిపారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అసోసియేషన్ తరఫున రూ.3 లక్షలను నార్సింగి ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ శ్రీశైలంకు అందజేశారు. పోలీస్ శాఖతో సమన్వయంతో దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2019 నుంచి కాలనీ అభివృద్ధి కోసం సొసైటీ సభ్యులు, ప్రజల సహకారంతో అనేక సమస్యలను పరిష్కరించామని ఉపేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులోనూ కాలనీ ప్రజల భద్రత, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధే ప్రజాపాలన లక్ష్యం

- ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలి
- శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం
- మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి
- ప్రజలు-పోలీసుల మధ్య నమ్మకం బలోపేతం కావాలి: సీపీ రమేష్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలన్నారు. ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో



పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికలు, వృద్ధులు, వలస కార్మికుల భద్రతకు సైబరాబాద్ పోలీసులు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. ప్రజలు-పోలీసుల మధ్య పరస్పర నమ్మకం, సహకారం బలోపేతమైతే సురక్షిత, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అడిషనల్ డీసీపీ షమీర్ తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గిరిజనుల ఆత్మగౌరవానికి కేసీఆర్ నిర్ణయాలు గుర్తులు


- తండాలకు పంచాయతీ హోదా కల్పించడం చారిత్రాత్మకం
- గిరిజన రిజర్వేషన్ల పెంపు కేసీఆర్ ప్రభుత్వ ఘనత
- సంగాయిపల్లి తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



**యాలాల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం యాలాల మండలం సంగాయిపల్లి తండాలో తండావాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. 500కు పైగా జనాభా ఉన్న ఎస్టీ ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా మార్చినట్లు తెలిపారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ 2022 సెప్టెంబర్ 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ విద్యాసంస్థల విస్తరణతో పాటు విద్య, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమానికి గత ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. "మా తండాలో మా పాలన" అనే గిరిజనుల ఆకాంక్షకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాలు వారి ఆత్మగౌరవానికి గుర్తులని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సిద్రాల శ్రీనివాస్, రమేష్, రామచంద్రారెడ్డి, విక్రాంత్, నారాయణ, సుక్యానాయక్, తార్యనాయక్, గణేష్, తండావాసులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 19న 'భారత్ భాగ్య విధాత' కార్యక్రమం

- విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపేందుకు - ప్రిన్సిపాల్ రాధారెడ్డి
- లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్‌లో నిర్వహణ




**కీసర, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలను నేటి తరానికి పరిచయం చేసి విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించడమే లక్ష్యంగా 'భారత్ భాగ్య విధాత' పేరుతో ప్రత్యేక చారిత్రక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధారెడ్డి తెలిపారు. కీసర బండ్లగూడలోని పాఠశాల ప్రాంగణంలో సెప్టెంబర్ 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాధారెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలు, పోరాటాలు, త్యాగాలను విద్యార్థులకు పరిచయం చేసి, వారి నుంచి స్ఫూర్తి పొందేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. పుస్తకాల్లో చదివే చరిత్రను ప్రత్యక్ష అనుభూతిగా అందించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించాలన్నదే కార్యక్రమం ఉద్దేశమన్నారు.
'ఎందరో వీరుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించింది. వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని నిర్మించే బాధ్యత నేటి విద్యార్థులపై ఉంది' అని రాధారెడ్డి పేర్కొన్నారు. చరిత్రను తెలుసుకోవడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ భవిష్యత్తు నిర్మాణంలో విద్యార్థుల పాత్రను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, దేశభక్తి భావాలు కలిగిన ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పాఠశాల యాజమాన్యం కోరింది.

# కెసిఆర్‌తోనే తండాల అభివృద్ధి

- హర్యానాయక్ తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..
- సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్



**తలకొండపల్లి సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** కెసిఆర్,తోనే తండాలు అభివృద్ధి చెందాయని సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణా నాయక్ అన్నారు. గురువారం తలకొండపల్లి మండల పరిధిలోని హర్యానాయక్ తండాలో తెలంగాణ విమోచన దినోత్స వాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు చిత్రపటానికి గ్రామ సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు,గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి,గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి స్వయం పాలన కల్పించిన మహనీ యుడు కేసీఆర్ అని కొనియాడారు.గిరిజన సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఏకైక నేత కేసీఆర్ అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఆయన హయాంలోనే గిరిజన రైతులకు రైతుబంధు,రైతుబీమా,24 గంటల ఉచిత విద్యుత్,కల్యాణలక్ష్మి,గిరిజన గురుకులాల ఏర్పాటు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యా యని గుర్తు చేశారు.లంబాడీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి తండాల రూపురేఖలే మార్చారని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోవడం లేదని,తిరిగి కేసీఆర్ పాలన రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్,మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**కేశంపేట సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టివేశారు. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ కానిస్టేబుల్‌లు శివకుమార్ రెడ్డి, శివుడు మండల పరిధిలోని సంగేమ్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మట్టి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా సంగెం శివారు నుండి వేముల నర్వ గ్రామానికి మట్టిని తరలిస్తున్నట్లు తెలిపాడు. మట్టి రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఇమ్మిడి వేణుగోపాల్, యజమాని ఇమ్మిడి మల్లేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీధర్ గౌడ్



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కందికంటి శ్రీధర్ గౌడ్ నియమితులయ్యారు. హయత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏఐపిసి చైర్ పర్సన్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, తో కలిసి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

## బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వరుణ్ కుమార్

**బీసీ ఉద్యమాన్ని బలోపేతం కోసం కృషి చేస్తా**



**మహేశ్వరం,సెప్టెంబర్17 (జనంసాక్షి):** కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన వరుణ్ కుమార్ ను బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య గురువారం నియమించారు.ఈ సందర్బంగా వరుణ్ కుమార్ మాట్లాడుతూ...బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు.బీసీల ఐక్యత కోసం కృషి చేస్తానన్నారు.తనపై నమ్మకంతో పదవి అప్పగించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు భాస్కర్,బీసీ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ లో ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేయాలి

**ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ**



**కడ్తాల్ సెప్టెంబర్ 17(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ లాయక్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రయాణికల సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమల్లోకి తెచ్చిన ఆర్టీసీ బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆపడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కడ్తాల్ మండల కేంద్రంలో ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు తగిన సమాచారంతోపాటు బస్సులు నిలిపే అవకాశాలు ఉంటాయని లాయక్ అలీ ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా కూడా అన్ని మండల కేంద్రాలలో ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బంజారాల అభివృద్ధి**

**మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**మహేశ్వరం,సెప్టెంబర్17(జనం సాక్షి):** తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.గురువారం కందుకూరు మండల కేంద్రంలోని సామ నర్సింహ రెడ్డి ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్ బంజారా సమాజానికి విద్యా, ఉద్యోగాల్లో,రాజకీయ రంగాలలో 10 శాతం రిజర్వేషన్లను కల్పించారన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే బంజారాల అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందాయన్నారు.సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా ప్రకటించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు రాజు నాయక్,మన్నే జయేందర్ ముదిరాజ్,మాజీ కౌన్సిలర్ రవి నాయక్,దీప్ లాల్ చౌహాన్,లాచ్యా నాయక్, మోతీలాల్ నాయక్,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



**శామీర్ పేట్, సెప్టెంబర్ 17(జనం సాక్షి )** అలియాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్‌పర్సన్‌తో కేక్ కట్ చేయించిన అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అలియాబాద్ మున్సిపాలిటీ ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటు పార్టీ ప్రతిష్ట కోసం శిరీష కృష్ణారెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఉమ్మడి శామీర్‌పేట మండలం నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్య కర్తలు, శ్రేయోభిలాషులు చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.తన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా, సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులకు చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం మాదాపూర్ లోని న్యాక్ భవనంలో ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం గర్వం, గౌరవ భావాలతో నిర్వహించడం జరిగిందని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి సృజన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవం కార్యక్రమంలో సిఎంసి కమిషనర్ తోపాటు వివిధ శాఖల అధిపతులు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ చారిత్రక ప్రస్థానంలో ప్రజలకోసం పోరాడిన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాసేవ, సమానత్వం, ఐక్యత, ప్రజల భాగస్వామ్యం వంటి విలువలను గుర్తుచేసుకున్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ప్రజల పోరాటం, త్యాగాలు, స్వేచ్ఛ కోసం వారి ఆకాంక్షలను గుర్తుచేసే చారిత్రక సందర్భంగా కమిషనర్ అభివర్ణించారు. అయితే సెప్టెంబర్ 17 ను కేవలం గతాన్ని స్మరించుకోవడానికే పరిమితం కాకుండా, వారి త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగుతూ ప్రజా సంక్షేమం, సమానత్వం, ఐక్యత, బాధ్యతాయుతమైన పాలన కోసం



కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపారు. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజల అవసరాలకు స్పందించే పరిపాలన ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సేవలను మరింత సమర్థవంతంగా అందించడం ప్రభుత్వ సంస్థల బాధ్యత అని గుర్తుచేశారు. ఈ క్రమంలో అధికారులు, సిబ్బంది ప్రజాసేవా విలువలను పాటిస్తూ, ప్రజా సంక్షేమం, మెరుగైన పౌర సేవలు మరియు సైబరాబాద్ సమగ్ర అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# మట్టి గణపతులకు రాజ్‌కుమార్ ప్రోత్సాహం

- నిర్వాహకులకు ఘన సన్మానం.
- మట్టి గణపతుల వైపు తాండూరు అడుగులు వేయాలి.
- వందల సంఖ్యల్లో మట్టి గణపతుల ఏర్పాటుకు పెద్దలు కృషి చేయాలి.
- కాగ్నా, కోకట్ వాగులను కాలుష్యం నుంచి కాపాడుకోవాలి.
- జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్.

**తాండూరు సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణతో పాటు కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని బీసీ సంఘం తాండూరు నియోజకవర్గ కన్వీనర్, జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. తాండూరులోని తులసీనగర్, సాయినగర్, గ్రీన్ సిటీ, దోబీగల్లి, గుమాసానగర్, నెహ్రూగంజ్, మార్కండేయ కాలనీ, గాంధీచౌక్, కోకట్ రోడ్, పాత తాండూరు తదితర ప్రాంతాల్లో మట్టి వినాయకులను ప్రతిష్ఠించిన మండపాలను రాజ్‌కుమార్ సందర్శించి, నిర్వాహకులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, తాండూరులో వందల సంఖ్యలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ మట్టి వినాయకులు పదుల సంఖ్యలోనే ఉండటం ఆలోచించాల్సిన విషయమన్నారు.



రాబోయే రోజుల్లో హిందూ ఉత్సవ సమితి, బీసీ సంఘం, తాండూరు పెద్దలతో కలిసి వందల సంఖ్యలో మట్టి వినాయకులను ప్రతిష్ఠించేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు,మట్టి వినాయకుల వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు కాగ్నా నది, కోకట్ ప్రాంతంలోని నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని అన్నారు. అలాగే మట్టి వినాయకుల తయారీపై ఆధారపడి జీవిస్తున్న కుమ్మరి మరియు ఇతర సంప్రదాయ కళాకారుల కులవృత్తులకు ప్రోత్సాహం అందించి నవారమవుతామని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు సయ్యద్ షకూర్, జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేశ్, బీసీ మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, బీసీ సంఘం యువ నాయకులు రాము ముదిరాజ్, అంబాదాస్, పరమేశ్, హరిప్రసాద్, రాహుల్, మాధవ్, నాయి బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు పరమేశ్, రజక సంఘం నాయకులు రమేష్, రాజు, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో అతిథి ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మొయినాబాద్, సెప్టెంబర్ 17, జనంసాక్షి:** విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి హరిష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఖాసింభౌలి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన నజీబ్ నగర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6 తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 6 తరగతి నుంచి పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రంలో విద్యాబోధన చేయడానికి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ ( అతిథి ఉపాధ్యాయులుగా) గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు డిగ్రీతో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం రు. 18 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విదంగా ఇంటర్ విద్యార్థులకు( ఒకేషనల్ కోర్స్ ) విద్యాబోధన చేయడానికి బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. వారికి నెలసరి వేతనంరూ. 23 వేలు చెల్లించడం జరుగుతుందని అన్నారు. విద్యా బోధనతో పాటు రాత్రి సమయంలో స్టడీ అవర్స్ లో కూడా విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు విద్యాలయానికి తమ విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

**మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్**



**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి)** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం-వాస్తవాలు, వక్రీకరణలు" అనే అంశంపై కళాశాల విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటమని భాస్కర్ అన్నారు. నిజాం, రజాకార్లు, పటేల్-పట్వారీ వ్యవస్థ, దేశ్‌ముఖ్‌ల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని తెలిపారు. ఈ పోరాట చరిత్రను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారు 4,000 మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, 3,000 గ్రామాలకు విముక్తి కల్పించి సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఈ పోరాటానికి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రభావంతో భూ సంస్కరణలకు సంబంధించిన అంశాలు పాలకుల దృష్టికి వచ్చాయని అన్నారు. జాగీర్దారీ రద్దు, భూ పరిమితి వంటి చట్టాల రూపకల్పనలో ఈ పోరాటం ప్రభావం ఉందని భాస్కర్ పేర్కొన్నారు. పోరాట చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేసి, దాని వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్, మండల కార్యదర్శి చందు, మొయినాబాద్ మండల ఉపాధ్యక్షుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ**

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని చేవెళ్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను, నాటి పోరాటంలో ప్రజలు, వీరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పండ్లు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## దుండిగల్ సర్కిల్ ఆఫీస్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**నిజాంపేట్ సెప్టెంబర్ 17 జనం సాక్షి :** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని దుండిగల్ సర్కిల్ 59 కార్యాలయ ఆవరణలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ జాతీయ జెండాను ఎగరవేసినారు. ఈ వేడుకల్లో ఏఎంసీ లక్ష్మయ్య, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేంద,ర్ నాయక్, అశోక్ కుమార్, వార్డ్ ఆఫీసర్లు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: పట్నం మహేందర్‌రెడ్డి

- వెంకటయ్య, ప్రేమ్‌కుమార్ శర్మ కుటుంబాలకు పరామర్శ
- విశ్వకర్మ జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు
- ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ
- హిందూ ఉత్సవ కేంద్ర సమితికి రూ.3.51 లక్షల విరాళం

తాండూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): బషీరాబాద్ మండలం ఖాసీంపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. వెంకటయ్య గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో చేసిన సేవలు మరువలేనివని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం బృందావన్ కాలనీలో నాపరాతి వ్యాపారి ప్రేమ్‌కుమార్ శర్మ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి



పూలమాల వేసి నివాళులర్పించారు.

తాండూరు పట్టణంలోని విశ్వకర్మ ఆలయంలో నిర్వహించిన శ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో మహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో విశ్వకర్మ సంఘానికి మూడు ఎకరాల స్థలం కోసం తనవంతుగా రూ.10 లక్షలు సమకూర్చినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణంతో పాటు రహదారి, ప్రహరీ తదితర మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. విశ్వకర్మ సంఘం ప్రతినిధులు ఆయన సేవలను కొనియాడి, ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని



కోరారు.

అలాగే తాండూరులో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల కోసం మహేందర్‌రెడ్డి రూ.3,51,000 విరాళాన్ని అందజేశారు. హిందూ ధర్మం, సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణకు తన సహకారం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో బీదర్ రాజశేఖర్, అబ్దుల్ ఖవి, శంకర్ యాదవ్, రాజకుమార్, కరణం పురుషోత్తంరావు, శ్రీనివాసచారి, బిర్కాట్ రఘు, అంతారం కిరణ్ ముదిరాజ్, ఆశిష్ అష్టికర్, మధులత తదితరులు పాల్గొన్నారు.

# సృష్టికి మూలం విశ్వకర్మ



## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో యజ్ఞ మహోత్సవం
- ఐక్యతతోనే సమాజ అభివృద్ధి: సంఘం నాయకులు

**మొయినాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో మొయినాబాద్ శివాలయ పరిధిలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే సంఘ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, మండల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు వేద మంత్రోచ్ఛారణల మధ్య యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.
కార్యక్రమానికి టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మండల అధ్యక్షుడు రాంపల్లి సంతోష్‌కుమార్ చారి, సభాధ్యక్షుడు నరసింహాచారి మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడిని సృష్టికి మూలకర్తగా ఆరాధిస్తున్నామని తెలిపారు. దేవ శిల్పిగా, ప్రపంచ రూపకర్తగా విశ్వకర్మ భగవానుడిని హిందూ ధర్మంలో కొలుస్తారని పేర్కొన్నారు. సమాజం ఐక్యంగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలి



**తలకొండపల్లి:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమణి రవిగౌడ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరేటి నర్సింహ, జిల్లా కార్యదర్శి శానమోని పాండు, మండల అధ్యక్షుడు తిరుమణి రవిగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ విమోచన చరిత్ర, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదులు, అమరవీరుల త్యాగాలు, ఆపరేషన్ పోలో ఘట్టాలను విద్యార్థుల పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ హక్కుల కోసం 1,700 కి.మీ. మహా పాదయాత్ర

75 రోజులు.. ఏడు రాష్ట్రాల మీదుగా ఢిల్లీకి

**తలకొండపల్లి:** విశ్వకర్మ హక్కుల సాధన కోసం చేపట్టిన మహా పాదయాత్రను రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హైదరాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ యాత్ర 75 రోజుల పాటు 1,700 కిలోమీటర్లు ఏడు రాష్ట్రాల మీదుగా ఢిల్లీ వరకు కొనసాగనుంది. పంచవృత్తులైన కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, విశ్వకర్మ కార్పొరేషన్‌కు భారీగా నిధులు కేటాయించాలని, విశ్వకర్మ జయంతిని అధికారిక వేడుకగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ యాత్ర చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విశ్వకర్మ వర్గాల హక్కుల సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన వడ్ల సత్యంచారి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## కమిటీ హాల్ కోసం 225 గజాల స్థలం కేటాయింపు

ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్



**కొడంగల్:** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో బండల ఎల్లమ్మ దేవాలయం, అయ్యప్ప దేవాలయం సమీపంలో విశ్వకర్మ కమిటీ హాల్ నిర్మాణానికి 225 గజాల స్థలం కేటాయించిన సందర్భంగా విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు, యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ కుమార్, రెండో వార్డు కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్‌నాయక్, శివకుమార్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వడ్ల బ్రహ్మయ్యచారి, వడ్ల రవీందర్‌చారి, వడ్ల రాజేష్‌చారి, వడ్ల రాఘవేందర్‌చారి, ప్రవీణ్‌చారి, నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


చేతివృత్తుల నైపుణ్యం ఎంతో విలువైనది

**హయత్‌నగర్:** వనస్థలిపురం ఎన్‌జీవోస్ కాలనీలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరై విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో విశ్వకర్మ సమాజం, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి కృషి, నైపుణ్యం ఎంతో విలువైనవని అన్నారు. విశ్వకర్మ సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సంఘ సభ్యులకు, చేతివృత్తుల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



## కళలు, వృత్తులు, నిర్మాణ నైపుణ్యాలకు విశ్వకర్మ ప్రతీక

- జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో ఘనంగా జయంతి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో చిత్రపటాలకు పూలమాలలు



**ముషీరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** వివిధ కళలు, వృత్తులు, నిర్మాణ నైపుణ్యాలు, సాంకేతిక ప్రతిభకు ప్రతీకగా భావించే విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్, బీఎంఈయూ-బీఎంఎస్ రికగ్నైజ్డ్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, సర్కిల్, వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.
ముషీరాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట్, ముషీరాబాద్, కవాడిగూడ, బోయిగూడ, మల్కాజిగిరి, ఉప్పల్, అల్వాల్, కాప్రా, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాలతో పాటు వివిధ జోన్లలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, జోనల్, సర్కిల్, వార్డు కార్యవర్గ సభ్యులు, జీహెచ్ఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు. విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో కళలు, వృత్తులు, సాంకేతిక రంగాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో విద్యార్థిని సుప్రజకు బహుమతి ప్రశంసా పత్రం అందజేత




**రాజేంద్రనగర్, సెప్టెంబర్17(జనంసాక్షి)** భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతి వేడుకలు, విశ్వేశ్వరయ్య మెమోరియల్ అవార్డ్స్-2026 కార్యక్రమాన్ని బుధవారం మెగాసిటీ నవకళ వేదిక, మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనా చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అధ్యక్షత వహించగా, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ రావు దీప ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య మెమోరియల్ అవార్డులను ప్రదానం చేశారు. లాల్‌దర్వాజా నాట్య కళాకారిణి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో అబిడ్స్ స్టేట్ స్కూల్ విద్యార్థిని ఆవార్ సుప్రజా అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో సీఈ రిటైర్డ్ ఐఅండ్‌సీఏడీ పన్నాల రామయ్య చేతుల మీదుగా బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంది. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బైక్ పై గల్లీ గల్లీ తిరుగుతూ వినాయకుల దర్శనం

సింప్లిసిటీతో ఆకట్టుకున్న శ్రీనివాస్ రెడ్డి



తాండూరు సెప్టెంబర్ 17(జనంసాక్షి) : వినాయక చవితి వేడుకల సందర్భంగా తాండూరులో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆర్టీఏ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి సింపుల్ గా బైక్ పై పర్యటిస్తూ పలు వినాయక మండపాలను సందర్శించి ఆకట్టుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్దకు స్వయంగా బైక్ పై వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి అంటే ఐక్యతకు, సంతోషానికి ప్రతీక. తాండూరు ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ గణనాథుడిని కోరుకున్నాను. ప్రతి మండపంలో యువకులు చూపిస్తున్న ఉత్సాహం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. అందరితో కలిసిపోయే తత్వంతో, హంగు ఆర్భాటాలు లేకుండా బైక్ పై మండపాలను సందర్శించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ రెడ్డి వెంట ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తాండూర్‌లో ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



తాండూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి): తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా గురువారం శోభాయాత్ర రూట్‌మ్యాప్, నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. కాగ్నా నది, భూకైలాష్, మాల్రెడ్డిపల్లి చెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

అనంతరం డీఎస్పీ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, పోలీసుల సూచించిన రూట్‌మ్యాప్‌ను పాటించాలని ఎస్పీ తెలిపారు. శోభాయాత్రలో డీజేలు, బాణాసంచా వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. మద్యం, గంజాయి సేవించి ఉత్సవాల్లో పాల్గొనరాదన్నారు. విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన చోట్ల బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 8712670056 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ యాదయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్, మున్సిపల్ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమరవీరులకు నివాళులతో తెలంగాణ విమోచన దినోత్సవం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్17(జనంసాక్షి):**
కిస్మత్‌పూర్, నార్సింగి, మణికొండలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ నాయకులు నీరుడు పవన్ సాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కిస్మత్‌పూర్ వివేకానంద సెంటర్‌లో మాజీ ఉపసర్పంచ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ విమోచన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక ఘట్టమని, నాటి వీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్నపురెడ్డి భీమార్జున రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, ఎస్. శ్రీనివాస్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.నార్సింగిలో మున్సిపాలిటీ అధ్యక్షుడు మెండే నగేష్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో డివిజన్ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం మోదీ జన్మదినం సందర్భంగా పాలాభిషేకం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పొంగులేటి సుధాకర్ రెడ్డి, టి. అంజన్ కుమార్ గౌడ్, దుద్దాల లక్ష్మీనారాయణ, కొండకర్ల నరేందర్ రెడ్డి, చిలుకూరి బీరప్ప, అన్నపురెడ్డి భీమార్జున రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, జి. వినోద్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధారూర్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**- పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ.**



**ధారూర్,సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** 17 సెప్టెంబర్‌ను పురస్కరించుకుని ప్రజాపాలన దినోత్సవాన్ని ధారూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు.మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎండీఓ నర్సింలు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాజిదా బేగం,ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ చెన్నయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు.అలాగే వెలుగు కార్యాలయం,శ్రీశక్తి భవన్ తదితర కార్యాలయాల్లోనూ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు.దేశ ఐక్యత,సమగ్రతను కాపాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**మొయినాబాద్, సెప్టెంబర్ 17, జనంసాక్షి:**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ ప్రజాస్వామ్య విలువలు, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాల్సిన అవసరంపై అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కార్యక్రమంలో పేర్కొన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవనూర్ గ్రామపంచాయతీలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు.

**జాతీయ జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ రేణుకా దేవి.**

యాలాల సెప్టెంబర్ 17 ( జనం సాక్షి ) : నిజాం నిరంకుశ పాలన మరియు రజాకార్ల నుండి విముక్తి పొంది సెప్టెంబర్ 17, 1948న అధికారికంగా భారత యూనియన్ లో తెలంగాణ విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకుంటుండగా, తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోంది.ఈ ఆదేశాల మేరకు గురువారం దేవనూర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకా దేవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు పడిన కష్టాలను, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ చర్యతో తెలంగాణకు విముక్తి లభించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, జిల్లా పరిషత్ ,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ టీచర్లు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ

**శంకర్ పల్లి, సెప్టెంబర్ 17(జనం సాక్షి) :** ప్రజాపాలన దినోత్సవం లో భాగంగా శంకర్ పల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,తాసిల్దార్ కార్యాలయంలో సురేందర్ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యురాలు రేవతి, పొద్దుటూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ, పిల్లిగుండ్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి,దొంతన్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అజీజ్, మోకిలా(శేఖర్), మహాలింగాపురం(సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి), గాజులగూడ (సర్పంచ్ అనూష ప్రశాంత్ రెడ్డి), ఎల్వర్తి (సర్పంచ్ భాగ్యలక్ష్మి పాపారావు),కొండకల్ (సర్పంచ్ శేఖర్), శేరిగూడెం( నివేదిత ఇంద్రసేనారెడ్డి)లు జాతీయ జెండా ఎగురవేశారు.

## నవీన ఆదర్శ పాఠశాలలో తెలంగాణ విమోచన దినోత్సవం



**కొడంగల్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్‌లోని నవీన ఆదర్శ హై స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్, స్కూల్ ఫౌండర్ డి. వెంకటయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలిసి ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాముఖ్యత, తెలంగాణ చరిత్రకు సంబంధించిన పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ ప్రజల పోరాటం, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, నాటి పరిస్థితుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశ చరిత్ర, తెలంగాణ చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు.

**జెండా ఆవిష్కరణ చేసిన సాహు శ్రీలత లక్ష్మీకాంత్ గుప్తా.**



**తాండూరు సెప్టెంబర్ 17( జనంసాక్షి)** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తాండూరు పట్టణంలోని శివాజీ చౌక్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సాహు శ్రీలత లక్ష్మీకాంత్ గుప్తా, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి, ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ పొలిటికల్ విభాగ చైర్మన్ జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ విముక్తి పొందిన ఈ రోజు చరిత్రలో చిరస్మరణీయమని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడం ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణ ముదిరాజ్, కౌన్సిలర్ నాగారం మల్లేశం, బాలప్ప, గాజుల శాంతకుమార్ , కిరణ్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**హయత్‌నగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి)** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హైకోర్టు కాలనీ డివిజన్‌లోని శాంతినగర్ చౌరస్తా, భూలక్ష్మినగర్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలు, ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, విమోచన ఉద్యమ విశేషాలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహా, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద్ చారి, మహిళా నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.